ntnews.com
నమస్తే తెలంగాణ
గురువారం 19 అక్టోబర్ 2023



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జెండగే హమమంతు కొండిబా

## బ్యాంకులు ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలి

- కలెక్టర్ జెండగే హమమంతు కొండిబా

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 18 : బ్యాంకులు ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలని, అనుమానాస్పద ఖాతాల వివరాలు అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జెండగే హమమంతు కొండిబా సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసాధారణమైన, అనుమానాస్పద ఖాతాల లావాదేవీలపై అప్రమత్తంగా ఉండాలని, ఈనెల 9 నుంచి లక్ష పైన జరిగిన లావాదేవీలపై రిపోర్టు ఇవ్వాలని, 10లక్షల పైన లావాదేవీలపై ఐటీ నోడల్ అధికారికి పంపించడం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో ప్రభావితం చేసేలా బ్యాంక్ సేవలను రాజకీయ పార్టీల అభ్యర్థులు ఉపయోగించుకోకూడదనేదే ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అభ్యర్థి నామినేషన్ వేశాక కొత్త అకౌంట్ ఓపెన్ చేయాల్సి ఉంటుందని, అందుకోసం సకాలంలో సరైన చెక్ బుక్స్ ఇచ్చేలా ఏర్పాటు చేసుకోవాలని బ్యాంకర్లకు సూచించారు. జిల్లా లీడ్ బ్యాంక్ అధికారి బ్యాంకర్లకు సరైన అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎ.భాస్కర్ రావు, జిల్లా లీడ్ బ్యాంక్ అధికారి రామకృష్ణ, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నాగేశ్వరాచారి పాల్గొన్నారు.



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మలతో అధ్యాపకులు

## బతుకమ్మ సంబరాలు

భువనగిరి అర్బన్, అక్టోబర్ 18 : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. అధ్యాపకులు తీరొక్కపూలతో బతుకమ్మను పేర్చి పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. అనంతరం చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పాపిరెడ్డి, అధ్యాపకులు సుచిత్ర, చైతన్య, యోగేశ్వరి, భవాని, అనూష, జ్యోతి, సరిత, జోత్స్న పాల్గొన్నారు.




5కే రన్‌లో పాల్గొన్న హెచ్ఎస్ఐఎల్ కార్మికులు

## పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత

బీబీనగర్, అక్టోబర్ 18 : పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత అని హెచ్ఎస్ఐఎల్ పరిశ్రమ ప్లాంట్ హెడ్ ఆఫీసర్ వివేక్ తివారి అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లిలో పరిశ్రమ కార్మికుల ఆధ్వర్యంలో ప్రకృతిని కాపాడాలని బుధవారం 5కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో పరిశ్రమ జీఎం రవిశంకర్, డీజీఎంలు రామారావు, లక్ష్మీనారాయణ, సీనియర్ మేనేజర్ సుదర్శన్‌రెడ్డి, హెచ్ఆర్ కార్తీక్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో ముగ్గురిపై సస్పెన్షన్ ఎత్తివేత

మోటకొండూర్, అక్టోబర్ 18 : గతంలో బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ అయిన మండలంలోని అమ్మనబోలు గ్రామానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నాయిని రాంచంద్రారెడ్డితో పాటు ఏనుగుల అయిలయ్య, ఎగమాటి వెంకట్‌రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తివేసినట్లు మోటకొండూర్ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొట్ల యాదయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సస్పెన్షన్ ఎత్తివేయడంతో వారు బీఆర్ఎస్‌లో చేరడంలో ఎలాంటి అభ్యంతరాలు లేవని పేర్కొన్నారు.

# నెరవేరనున్న ఇంద్రియాల చిరకాల వాంఛ

- రూ.2.15కోట్లతో మూసీ నదిపై బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



ఇంద్రియాల శివారులో బ్రిడ్జి నిర్మించనున్న ప్రాంతం

భూదాన్‌పోచంపల్లి, అక్టోబర్ 18 : భూదాన్‌పోచంపల్లి మండలంలోని మారుమూల గ్రామం ఇంద్రియాల. ఆ గ్రామం నుంచి భువనగిరికి వెళ్లాలంటే బట్టుగూడెం మీదుగా 30 కిలోమీటర్ల చుట్టూ తిరిగి వెళ్లాలి. ఇంద్రియాల –జంపల్లి గ్రామాల మధ్య వంతెన ఏర్పాటు చేస్తే 18 కిలోమీటర్ల ప్రయాణం దూరం ఏర్పడుతుంది. గత 40 ఏండ్లుగా ప్రభుత్వాలకు విన్నవించినా పట్టించుకున్న పాపానపోలేదు. గ్రామస్తులు సమస్యను భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి ఇంద్రియాల–జంపల్లి మధ్య మూసీ నదిపై రూ.2.15కోట్లతో లో లెవెల్ బ్రిడ్జి నిర్మించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో ఈనెల 3న బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. దీంతో భూదాన్‌పోచంపల్లి, భువనగిరి మండలాలకు రవాణా సౌకర్యం మెరుగుపడనున్నది. బ్రిడ్జి మంజూరుపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం



ఇంద్రియాల నుంచి భువనగిరి వెళ్లేందుకు చుట్టూ తిరిగి వెళ్లాలి. ఏళ్ల తరబడి మా సమస్యను ఎవ్వరూ పట్టించుకోలేదు. మా కష్టాలను ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డికి వివరించగా బ్రిడ్జిని మంజూరు చేయించారు. గ్రామస్తులందరం ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం.

– పెద్దిరెడ్డి యాదగిరి, ఇంద్రియాల

### నిధుల మంజూరు హర్షణీయం



మూసీ నదిపై లో లెవెల్ వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి చొరవతో నిధులు మంజూరు చేయడం ఆనందంగా ఉంది. మూసీ దాటాలంటు ఆందోళనగా ఉండేది. ప్రజల కష్టాలు తెలుసుకున్న మనిషి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు.

– నోముల మాధవరెడ్డి, ఇంద్రియాల



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

## 20 నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి

- అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 18 : ఈనెల 20 నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని, అందుకోసం ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ ఏ.భాస్కర్‌రావు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలు కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గన్నీ బ్యాగులు, తేమ యంత్రాలు, టెంట్లు, టార్పాలిన్లను సిద్ధం చేసుకోవాలని, తాగునీరు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో 312 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, 3లక్షల50వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేయడం జరిగిందని, అవసరాన్ని బట్టి కొనుగోలు కేంద్రాలను పెంచుకుంటూ పోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు ధాన్యం నాణ్యత ప్రమాణాలను నిర్దేశించాలని, రైతులకు సరైన అవగాహన కల్పించాలని, రవాణా ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. అంతకుముందు పోచంపల్లి, బొమ్మలరామారం మండలం జూలూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ గోపికృష్ణ, జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి సబిత, జిల్లా సహకార అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## మీసాల గణేశ్‌కు జాతీయ అవార్డు



జాతీయ అవార్డు అందుకుంటున్న మీసాల గణేశ్

భూదాన్ పోచంపల్లి అక్టోబర్ 18: బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీలో జరిగిన ఆల్ ఇండియా బహుజన రైటర్స్ నాలుగొవ నేషనల్ కాన్ఫరెన్స్‌లో భూదాన్‌పోచంపల్లి మండలం భీమనపల్లికి చెందిన ప్రముఖ జానపద కళాకారుడు మీసాల గణేశ్‌కు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జాతీయ అవార్డును సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సాహిత్యాన్ని ముందుకు తీసుకపోవడం కోసం బహుజన సాహిత్య అకాడమీ ఏటా ఉద్యమకారులు, సంఘ సేవకులు, కవులు రచయితలు, స్వచ్ఛంద సంస్థలకు అవార్డులు అందజేస్తున్నట్లు తెలిపారు. మీసాల గణేష్ అవార్డు అందుకోవడంపై జానపద కళాకారులు హర్షం వ్యక్తం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

## అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయి

- బీఆర్ఎస్‌వై ఆలేరు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్

మోటకొండూర్, అక్టోబర్ 18 : సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తాయని బీఆర్ఎస్‌వై ఆలేరు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బొట్ల శ్రీనివాస్ అన్నారు. బుధవారం మోటకొండూర్ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బీఆర్ఎస్ యూత్ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలేరును అభివృద్ధి పథంలో నడిపిస్తున్న గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి వైపే ప్రజలకు ఉన్నారన్నారు. సమావేశంలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు భూమండ్ల సుధీర్, నియోజకవర్గ యూత్ ప్రధాన కార్యదర్శి జివిలికపల్లి వెంకటేశ్, మండల కోఆప్షన్ సభ్యుడు ఎండీ బురాన్, మండల యూత్ ప్రధాన కార్యదర్శి దడిగె మధు, సోషల్ మీడియా కన్వీనర్ మధు, నాయకులు పాల్గొన్నారు.

## పైళ్ల నవీన్‌కుమార్‌రెడ్డికి ఓయూ డాక్టరేట్



నవీన్‌కుమార్‌రెడ్డి

వలిగొండ, అక్టోబర్ 18 : మండలంలోని సుంకిశాల గ్రామానికి చెందిన పైళ్ల నవీన్‌కుమార్‌రెడ్డికి ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసిం ది. రసాయన శాస్త్రంలో ప్రొఫెసర్ కుతాటి భాస్కర్ పర్యవేక్షణలో స్పెక్ట్రోఫోటోమెట్రిక్ డిటెర్మినేషన్ ఆఫ్ డ్రగ్స్ అండ్ ఫార్మాష్యూటికల్ బైయాసింగ్ పోలిన్ సియోకాల్టె పోటాషియం పర్మాంగనేట్ ఆక్సిడైజింగ్ రియేజెంట్స్ అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రసాయన శాస్త్రంలో సమర్పించిన ప్రయోగాత్మక వ్యాసాలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమైనట్లు పేర్కొన్నారు. నవీన్‌కుమార్‌రెడ్డి మేడ్చల్ జిల్లాలో నాయబ్ తాసీల్దార్‌గా ఉద్యోగం చేస్తూ డాక్టరేట్ పొందడంపై కుటుంబసభ్యులు అభినందించారు.



దేవతామూర్తులకు పూజలు చేస్తున్న సిద్ధగురు రమణానందమహర్షి

## రమణేశ్వరంలో ప్రత్యేక పూజలు

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 18 : దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మండలంలోని నాగిరెడ్డిపల్లి సమీపంలో గల శివశక్తి అనుగ్రహ మహాపీఠం రమణేశ్వరంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాల్గొవ రోజు కూష్మాండాదేవిగా పార్వతీదేవి దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా సిద్ధగురు రమణానందమహర్షి మాట్లాడుతూ దేవతామూర్తులను ఆరాధిస్తే అహంకారం నశించి, సంపద, ఆరోగ్యప్రాప్తి చేకూరుతుందని తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

## ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

భువనగిరి సిటీ, అక్టోబర్ 18: వచ్చే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని, అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు చిలకమర్రి గణేశ్‌మాదిగ కోరారు. బుధవారం భువనగిరిలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం నవంబర్ 5న హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగల యుద్ధభేరి సభ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్ నాయకులు పాల్గొన్నారు.